
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

**



సూర్యాపేట

5

ఆదివారం 1 జూన్ 2025

చికెన్ ధరలు	
లైవ్	140
డ్రెస్	210
స్కిన్‌లెస్	240
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	39.0
కనిష్ఠం	26.0

అంగన్‌వాడీలకు

డబుల్ ధమాకా

- రిటైర్‌మైంట్ వయో పరిమితి 65ఏళ్లకు పెంపు, బెనిఫిట్స్ రెట్టింపు
- ఉమ్మడి జిల్లాలో 8,412 మందికి లబ్ధి

6

ఎండల వేడి తగ్గి వాతావరణం చల్లబడుతుండగా, విద్యార్థుల తల్లి దండ్రులు, రైతులకు జూన్ 'ఫీవర్' మొదలైంది. వేసవి సెలవులు ముగి సి మరో 12 రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. పిల్లల చదువులు, పంటల సాగు ఖర్చు తలుచుకుంటే విద్యార్థుల తల్లిదండ్రులు, రైతులకు కంటిమీద కునుకు కరువవుతోంది. పాఠశా లలు, కళాశాలల్లో డొనేషన్లు, వార్షిక ఫీజులు, హాస్టల్ ఫీజులు మొదలు యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, బస్సు చార్జీలు తదితర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి.

● ఆంధ్రజ్యోతి-మోత్కూరు



అమ్మో..₹ జూన్

- ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభం
- ప్రైవేట్ పాఠశాలలు, కళాశాల్లో ఫీజుల మోత
- పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి కొనుగోలుపై కలవరం
- ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ ఉచితమే అయినా ప్రైవేట్‌పైనే మోజు
- రైతులపై వానాకాలం పంటల సాగు భారం

ప్రైవేట్ విద్యారంగంపై ప్రభుత్వ నియం త్రణ లేకపోవడంతో ఏటా ఫీజులు, రవాణా, ఇతర ఖర్చులు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ ఉచితంగా ఇస్తున్నా, అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నా నాణ్యమైన బోధన లభించదేమోనన్న అనుమానంతో తల్లి దండ్రులు ఆ వైపు వెళ్లకుండా అప్పు చేసైనా సరే ప్రైవేట్ విద్య వైపే మొగ్గు చూపుతున్నారు.

ముగియనున్న వేసవి సెలవులు

మరో 12 రోజుల్లో వేసవి సెలవులు ముగిసి విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో అడ్మిషన్ల సందడి మొదలైంది. దీంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఖర్చుల ఆందోళన మొదలైంది. ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో ఫీజుల మోత మోగుతున్నది. గ్రామీణ ప్రాంతాల పాఠశాలల్లో నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఆయా పాఠశాల, చదివే తరగతిని బట్టి రూ.15,000 నుంచి రూ.50,000 వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, బస్సు చార్జీలు అంటూ అదనంగా మోతమోగిస్తున్నారు. కొందరు ఎక్కువ వేతనం కలిగిన ఉద్యోగులు, ఇతర ఆదాయ వనరులు ఉన్నవారు హైదరాబాద్ లాంటి నగరాల్లో చదివిస్తున్నారు. ఇక అక్కడయితే నర్సరీకి రూ.40,000, 1వ తరగతికి రూ.లక్ష చొప్పున ఫీజు వసూలు చేస్తున్నారు. అడ్మిషన్ ఫీజు, యూనిఫాం, పుస్తకాలు తదితర ఖర్చులు అదనం.

ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లోనూ కళాశాలను బట్టి ఏడాదికి రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. ఇక ఇంజనీరింగ్ కళాశాలల ఫీజులు కూడా భారీగానే పెరిగాయి. పిల్లలకు చదువు కొనాల్సిన పరిస్థితి ఏర్పడటంతో రైతులు, వ్యవసాయ కూలీలు, చిరుద్యోగులు, చిరు వ్యాపారులకు జూన్ వస్తుందంటేనే ఒంట్లో వణుకు పుడుతోంది.

రైతులపై సాగు భారం...

రైతులకు జూన్‌లోనే వానాకాలం పంటల సీజన్ ప్రారంభమవుతుంది. మెట్ట పంటలకు దుక్కులు సిద్ధం చేయడం, విత్తనాలు కొనడం, విత్తడానికి కూలి, వరి విత్తనాల కొనుగోలు, నార్లు పోయడం, నాట్లు, ఎరువులు తదితర ఖర్చులు జూన్‌లో ఉంటాయి. ఒక్కో రైతు జూన్‌లో సాగు విస్తీర్ణాన్ని బట్టి రూ.లక్ష నుంచి

- మిగతా 7వ పేజీలో...



రేపటి నుంచి ఇంటర్ తరగతులు 7

రాష్ట్రావతరణ వేడుకలకు

ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేటటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఈ నెల 2న రాష్ట్ర అవతర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో అప్పారావు, ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ శ్రీనివాస్‌నాయక్, మైనార్టీ అభివృద్ధి అధికారి జగదీష్‌రెడ్డి, డీటీడీవో శంకర్, సుదర్శన్‌రెడ్డి, శిరీష, డీడబ్ల్యూవో నర్సింహారావు, అరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, డీపీవో యాదయ్య, మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్షపునీరు నిల్వకుండా ముందస్తు చర్యలు

వర్షపునీరు నిల్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.ప్రధాన కూడళ్లు, ఆవాసప్రాంతాలు, మురుగుకాల్వల్లో పూడిక తీత పనులను యుద్ధ ప్రాదిపదికన చేపట్టాలన్నారు. భారీ వర్షం కురవక ముందే పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఆర్‌డీవో అప్పారావు,మునిసిపల్ కమిషనర్‌శ్రీనివాస్, డీపీవో యాదయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యం

ఎస్పీ నర్సింహ



బాధితులకు సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేటటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రతే పోలీస్ శాఖ లక్ష్యమని ఎస్పీ కే.నర్సింహ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్‌ఫోన్ రికవరీ మేళా నిర్వహించారు. ఇటీవల ప్రజలు పోగొట్టుకున్న సుమారు రూ.20లక్షల విలువైన 115 సెల్‌ఫోన్లను రికవరీ చేసి యజమానులకు అందజేసి మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో మొబైల్‌ఫోన్ ప్రతీ ఒక్కరికి నిత్యావసరమైందన్నారు. సెల్‌ఫోన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరికి పడితే వారికి ఓటీపీలు చెప్పవద్దన్నారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. మొబైల్ బ్లాక్ చేసి మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకొని, ఆ దరఖాస్తును పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. వినియోగదారులు ఎవరైనా సెకండ్‌హ్యాండ్ సెల్ కొనుగోలు చేస్తే యజమాని నుంచి రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలోఅదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్,ఆర్ఎస్ఐ రాజశేఖర్,పోలీస్ సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలన సామాజిక బాధ్యత

సమాజంలో డ్రగ్స్ నిర్మూలన సామాజిక బాధ్యత అని ఎస్పీ నర్సింహ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన డ్రగ్స్ నిర్మూలన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. డ్రగ్స్,గంజాయికి అలవాటు యువత జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆర్ఎస్ఐ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ క్రస్ట్ గేట్లకు

మరమ్మతులు

- సర్వీసింగ్ చేస్తున్న ప్రాజెక్టు అధికారులు
- వారంలో పనుల పూర్తి

6

- వానాకాలం ఆరంభంతో అయోమయం
- ఎప్పుడు కూలుతాయోనన్న ఆందోళన

పేటలో శంకర్ విలాస్ సెంటర్‌లో శిథిలావస్థకు చేరిన భవనం



పెచ్చులూడిన కోదాడ పాత ఎంపీపీ కార్యాలయ భవనం

భవనాలు శిథిలం

బతుకులు భయం భయం

నిజాం కాలం నాటి భవనాలు. కొన్ని కూలిపోగా, మరికొన్ని కూలిపోయే దశకు చేరుకున్నాయి. వర్షాకాలం ఆరంభం కావడంతో ఈ భవనాలు ఏ సమయంలో నేలమట్టమవుతాయోనన్న భయం ప్రజల్లో నెలకొంది. చాలా వరకు ప్రభుత్వ కార్యాలయాలు దశాబ్దాల క్రితం నాటి భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇప్పటికే ధ్వంసమైన భవనాల పై కప్పులు పెచ్చులూడుతుండగా, మరికొన్ని కురుస్తున్నాయి. వీటికితోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో స్థానికులు ఉండే ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు కూలి, ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. పాత భవనాలను గుర్తించి, వాటిని కూల్చేయడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని శిథిల భవనాలపై 'ఆంధ్రజ్యోతి' కథనం..

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

జిల్లాకేంద్రంలో చాలా భవనాలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతాయో తెలియని భయంకర పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలోని శంకర్ విలాస్ సెంటర్ ప్రాంతంలో పాత భవనం శిథిలావస్థలో ఉంది. 1969లో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో నాలుగు నుంచి ఆరు వరకు చిరు దుకాణాలున్నాయి. అధిక సంఖ్యలో కొనుగోలుదారులు వస్తుంటారు. అంతేకాకుండా రైతుబజార్ అంబేడ్కర్ ప్రాంతం నుంచి శంకర్‌విలాస్ సెంటర్, వాణిజ్యభవన్ సెంటర్ వరకు సుమారు 10 నుంచి 12 వరకు పాత భవనాలున్నాయి. ఇక్కడ ఏ నిమిషం ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. బీమారం రోడ్డు కృష్ణా థియేటర్ ప్రాంతంలో సుమారు ఐదు నుంచి ఎనిమిది వరకు పాత నివాస భవనాలుండగా, వాటిలో కుటుంబాలు నివసిస్తున్నాయి. అంతేకాకుండా అలంకార్ థియేటర్ ప్రాంతంలో పాత భవనంలో కుటుంబాలు నివసించడంతోపాటు పూలదుకాణం ఉంది. బొడ్రాయి బజార్ సమీపంలో అనేక భవనాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇలా అనేక భవనాలు జిల్లాకేంద్రంలో ప్రమాదకరంగా ఉన్నాయి. గోడలకు పెచ్చులు ఊడి కూలడానికి సిద్ధంగా ఉంది. ఇలా మునిసిపల్ పరిధిలో శిథిలావస్థలకు చేరిన భవనాలు అనేకం ఉన్నాయి. ఎప్పుడో కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఇళ్లు నేడు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. అంతేకాకుండా పలు సందర్భాల్లో ఇంటి పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. ప్రమాదకరంగా ఉన్న ఇళ్లలో ప్రజలు నివాసముంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అలాంటి ఇళ్లను గుర్తించి అందులో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించి, ఆ ఇళ్లను కూల్చివేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

శిథిలావస్థలో అనేక భవనాలు

సూర్యాపేట మునిసిపల్ పరిధిలో అనేక భవనాలు శిథిలావస్థకు చేరాయి. కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాల్లోనే ప్రజలు నివాసముంటున్నారు. వర్షాలు వచ్చినప్పుడు ఆ భవనాల్లో నివసించే వారు భయభయంగా ఉంటున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలు కూల్చి, వాటి స్థానంలో కొత్త ఇళ్లు నిర్మించుకుంటే ఇబ్బందులుండవు. కానీ ఆర్థిక సమస్యల కారణంగా

మిగతా 8వ పేజీలో..

నోటీసులు ఇచ్చాం



గతంలో సూర్యాపేట పట్టణంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి ఇంటి యజమానులకు నోటీసులు ఇచ్చాం. వాటిని కూల్చివేయాలని ఆదేశించాం. ఆ ఇళ్లలో నివాసముండవద్దని సూచించాం. శిథిలావస్థకు చేరిన ఇళ్లు వర్షాలు వచ్చినప్పుడు నాని కూలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

బి. శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, సూర్యాపేట.

పొంచి ఉన్న ప్రమాదం

కోదాడటౌన్: కోదాడ పట్టణంలోని చాలా భవనాలు శిథిలావస్థకు చేరాయి. మునిసిపల్ కార్యాలయం పక్కన ఉన్న పాత ఎస్‌బీహెచ్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయ భవనం, మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ భవనం, పాత ఎంపీపీ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం ఎస్‌బీహెచ్ కార్యాలయ భవనాన్ని మున్సిపల్ సిబ్బంది ఉపయోగిస్తున్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలోని పాలన విభాగం భవనం పెచ్చులూడటంతోపాటు భవనం చుట్టూ చెట్లు పెరిగి కూలటానికి సిద్ధంగా ఉంది. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ భవనం శిథిలావస్థకు చేరింది. ఆ భవనంలో సుమారు 10 గదుల్లో వ్యాపార కార్యకలాపాలు, అద్దె నిర్వాహకులు చేస్తున్నారు. ఇప్పటికే భవనం కూల్చివేయాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించుకున్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. అదేవిధంగా పాత ఎంపీపీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం కొత్త ఎంపీపీ కార్యాలయం నిర్మాణం చేయటంతో పాత కార్యాలయం నిరుపయోగంగా ఉంది.



కోదాడలో శిథిలావస్థకు చేరిన పాత ఎంపీపీ కార్యాలయం

పొగాకు రహిత సమాజం కోసం కృషి

డీఎంహెచ్‌వో చంద్రశేఖర్



సూర్యాపేట ఆరోగ్య కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది

భానుపురి, మే 31(ఆంధ్రజ్యోతి): పొగాకు రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూర్యాపేట డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ అన్నారు. శనివారం సూర్యాపేటలోని అంబేడ్కర్‌నగర్‌లో ఉన్న అర్బన్ ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయ మనోరి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నజియా, కీసర ఆశ్రీత, డాక్టర్ నాగరాజు, మెడికల్ ఆఫీసర్ రమ్య, సాంబశివరావు, లింగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కోదాడటౌన్: పొగాకు ఉత్పత్తులను నిషేధించాలని కోదాడ సీనియర్ సివిల్ జడ్జి కే.సురేష్ అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోదాడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్మికులకకు మండల లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. కార్మికులు పొగాకు ఉత్పత్తుల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. పొగాకు వాడకంతో క్యాన్సర్, కాలేయ, పేగు సమస్యలు, నోటిపూత, బీపీ, షుగర్, కిడ్నీ, ఇతర అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. పొగాకు ఉత్పత్తుల నియంత్రణకు చట్టాలున్నాయని, వాటి ద్వారా శిక్షలు ఉంటాయని, పొగాకు ఉత్పత్తుల ఆకర్షణీయమైన ప్రకటనలకు మోసపోవద్దన్నారు. మున్సిపల్ కార్మికులతో పొగాకు, సిగరేట్లు తాగబోమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఉయ్యాల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, రెండో క్లాస్ మెజిస్ట్రేట్ సీహెచ్ సత్యనారాయణ, న్యాయవాదులు గట్ల నరసింహారావు, ఈదుల కృష్ణయ్య, నాళం రాజయ్య, కోడూరు వెంకటేశ్వరరావు, సామ నవీన్, హుస్సేన్, మంద వెంకటేశ్వర్లు, హేమలత, కోదండపాని, సక్రునాయక్, మండల లీగల్ సర్వీస్ కమిటీ మౌనిక, అనిత, మున్సిపల్ మేనేజర్ రాబిన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్



జెండా ఊపి ప్రచారజాత వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఈవో అశోక్

సూర్యాపేటఅర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచారజాత వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, సమానమైన విద్య అందుతుందన్నారు. డిజిటల్ బోధన, యూనిఫాం, క్వాలిఫైడ్ టీచర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి మాట్లాడుతూ పదేళ్లుగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకై ప్రచార జాత నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎన్. సోమయ్య, ఎస్.అనిల్‌కుమార్, యాకయ్య, వెంకటయ్య, ఆడం రమేష్, లాలు, శ్రీనివాసాచారి, వీరారెడ్డి, పాపిరెడ్డి, ఆనంద్, సీనయ్య, వంశీ, నరేష్, రాఘవులు, శ్రీనివాస్, చందు, అనిల్ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను పట్టించుకోని ప్రభుత్వం

హుజూర్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సందర్భంగా కామారెడ్డి సభలో రాహుల్‌గాంధీ సాక్షిగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. శనివారం పట్టణంలోని బీసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి అమలుచేయడం లేదన్నారు.

కులగణను షెడ్యూల్ 9లో చేర్చడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను మంజూరుచేయాలని, సబ్ ప్లాన్ నిధులకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేయాలన్నారు. బ్యాంకుల ద్వారా బీసీలకు రుణాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో వెంకన్న, కృష్ణ, శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

ఆధునిక వ్యవసాయంపై అవగాహన

వ్యవసాయ శాస్త్రవేత్త మానస



ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మానస

మేళ్లచెర్వు, మే 31(ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన అవసరమని వ్యవసాయ వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వి. మానస అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలకేంద్రంలోని రైతు వేదికలో ఆధునిక వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు, రసాయన ఎరువులను ఒకే దఫా అధిక మొత్తంలో కాకుండా మూడు నాలుగు దఫాలుగా ఉపయోగించాలన్నారు.

నత్రజని వాడకం తగ్గించాలని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు అధిక దిగుబడినిచ్చే విత్తనాలను ఎంచుకోవాలన్నారు. సమన్వయంతో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి పైరుకు చీడ పీడలు, తెగుళ్ల నుంచి రక్షణ కల్పించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొటించవచ్చునన్నారు. కార్యక్రమంలో గరిడేపల్లి కేవీకే శాస్త్రవేత్త కిరణ్, మండల వ్యవసాయాధికారి పద్మ, మండల పశువైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండారెడ్డి, అగ్నిసంపత్తి ఎఫ్‌టీవో సాయిరెడ్డి, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను నిలిపివేయాలి

నాగారం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరబోయినగూడెం గ్రామ సమీపంలోని బిక్కెరు నుంచి అక్రమ ఇసుక రవాణాను నిలిపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. శనివారం ఈ మేరకు తహసీల్దార్ హరికిషోర్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు వెలుగు రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం జాజిరెడ్డిగూడెం మండలంలోని తుంగగూడెం నుంచి ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చిందని, కానీ నాగారం మండలం పేరబోయినగూడెం గ్రామ సరిహద్దులోని బిక్కెరు వాగు నుంచి రోజుకు 500 ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారని ఆరోపించారు. అనుమతి ఉన్న చోటునుంచే ఇసుక తీసుకెళ్లాలని గతంలో తహసీల్దారుకు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో జాజిరెడ్డిగూడెం-నాగారం మండలాల సర్వేయర్‌తో తుంగగూడెం-పేరబోయినగూడెం మధ్య బిక్కెరు వాగు హద్దును నిర్ణయించారని తెలిపారు. వెంటనే గ్రామం నుంచి ఇసుక అక్రమ రవాణాను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు గండమల్ల లక్ష్మయ్య, వెలుగు రమేష్, పేరబోయిన నాగరాజు, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదు

- మేం వచ్చాక 17,169కోట్ల కేటాయింపు
- గిరిజనుల హక్కులు కాపాడేలా నల్లమల్ల డిక్లరేషన్ ఇచ్చాం: భట్టి విక్రమార్క
- గిరిజనుల హక్కులను రక్షించాలి: మీనాక్షి

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ సర్కారు గిరిజనుల కోసం సబ్‌ప్లాన్ నిధులను ఏ మాత్రం ఖర్చు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.17,169కోట్లను కేటాయించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసానిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కాంగ్రెస్ తెలంగాణ ఆదివాసీ కార్యకర్తల సమ్మేళనం ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో సబ్‌ప్లాన్ నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గిరిజనుల అవసరాలేంటో తెలుసుకునేందుకు ఆ వర్గాలకు చెందిన నాయకులను ఒకచోట చేర్చి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. అడవి బిడ్డలు ఆత్మగౌరవంతో జీవించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర జల గిరిజన వికాస పథకం తీసుకొచ్చిందని వెల్లడించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు నల్లమల్ల డిక్లరేషన్ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నాటరాజన్ మాట్లాడుతూ.. గిరిజనుల చట్టాలను, హక్కులను పరిరక్షించి వారిని అన్నిరంగాల్లో ముందు వరుసలో నిలపాలన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ పరిరక్షించినప్పుడే వారు అభివృద్ధిలో ముందుకు వెళ్తారని, దీనికోసం కాంగ్రెస్ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. పోడు భూముల్లో సాగు చేసుకుని జీవనం సాగించేందుకు అడవి బిడ్డలకు ఆర్థికంగా చేయూతనందించాలనిసూచించారు. పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం రూ.కోట్లాది నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాడు ఇందిరాగాంధీ నుంచి ఇప్పటి సోనియాగాంధీ వరకు గిరిజనుల అభివృద్ధికోసం,వారిని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు.



పాల్వంచలో ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న భట్టి

ప్రభుత్వ పనితీరుపై మీనాక్షి ఆరా

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మీనాక్షి నటరాజన్ శనివారం పాల్వంచలోని జెన్కో అతిథిగృహంలో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ ఒక్కో ఎమ్మెల్యేతో వేర్వేరుగా మాట్లాడి.. వారి నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయా ఎమ్మెల్యేలు ప్రభుత్వ పని తీరు బాగానే ఉందని, రుణమాఫీ, రైతు బంధు పథకం అందరికీ అందలేదన్న వ్యతిరేకత కొంత ఉందని ఆమె వివరించినట్లు తెలిసింది.

కొందరు బీజేపీ సీనియర్లతో కేసీఆర్‌కు సంబంధాలు



- ఆ కారణంగానే పార్టీ అధ్యక్ష పదవి నుంచి బండిని తప్పించారు
- గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పిన వారే బీజేపీ అభ్యర్థులు: మహేశ్ గౌడ్

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని, కొందరు బీజేపీ సీనియర్ నాయకులతో కేసీఆర్‌కు సంబంధాలున్నాయని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ సంబంధాల కారణంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించారన్నారు. రేపో.. మాపో.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని గురుకుల పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మహేశ్ గౌడ్ మాట్లాడారు. 'బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పినట్టే గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పినట్టుగానే బీజేపీ తమ అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి తెలంగాణలో పునాదులు లేవు.. ఆ పార్టీ ఇక్కడ అధికారంలోకి రావడం కలే.. రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉంది. అన్ని వర్గాల ప్రజలకు చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పార్టీ బలోపేతమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వల్ల.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తప్పనిసరిగా కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది' అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్.. ఒక్కటేనని బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని కొట్టిపారేశారు. బండి సంజయ్ మాటలను ప్రజలు నమ్మడం లేదని, ఆయన ఇంకా యువ మోర్చా నాయకుడిలా మాట్లాడటం సరికాదన్నారు.

అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధే లక్ష్యం: కేటీఆర్

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతమని, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో ప్రాగ్మటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్) నాలెడ్జ్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దిగ్గజ కార్పొరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలందించడం గర్వకారణం అన్నారు. పెట్టుబడులు వచ్చి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు దొరకాలని, అందుకోసం సర్వశక్తులు ఉపయోగిస్తామని చెప్పారు.

కేసీఆర్‌కు నోటీసులంటే.. తెలంగాణకు ఇచ్చినట్లే

ఆయనపై ఈగ వాలినా ఊరుకోం.. కాళేశ్వరం కమిషన్ నోటీసులకు వ్యతిరేకంగా 4న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

- జాగృతి నూతన కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. తెలంగాణ జాతిపిత అని, ఆయనకు నోటీసులు ఇవ్వడమంటే యావత్తు తెలంగాణకు నోటీసులిచ్చినట్లేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్‌పై ఈగ వాలినా తాము ఊరుకోబోమని హెచ్చరించారు. కేసీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఒక కన్ను అయితే.. తెలంగాణ జాగృతి మరో కన్ను అని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసం సమీపంలో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని కవిత ప్రారంభించారు. కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించిన అనంతరం బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోదావరి జలాల్లో 200 టీఎంసీల హక్కు తెలంగాణకు ఉండాలని కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని తెలిపారు. "కాళేశ్వరం ద్వారా ఏటా 20 లక్షల ఎకరాలకు నీళ్లు అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా? కోటి ఎకరాల మాగాణంగా తెలంగాణను చేసినందుకు నోటీసులు ఇచ్చారా ? రైతు బీమా, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టినందుకు ఇచ్చారా? తెలంగాణ ప్రజలకు మేలు చేసినందుకు ఇచ్చారా? అది కాళేశ్వరం కమిషనా? లేక కాంగ్రెస్ కమిషనా?"అని కవిత ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం పట్ల ప్రతి తెలంగాణ బిడ్డ బాధపడుతున్నారని అన్నారు.

నీళ్లు తరలించుకుపోతుంటే మాట్లాడరేం?

ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ నీళ్లను తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం అంత బలహీనంగా ఎందుకున్నారని, పక్క రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఎందుకు పనిచేస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నదుల అనుసంధానాన్ని తుపాకులగూడెం నుంచి చేపట్టేలా ప్రతిపాదించారని, కానీ.. ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకుండా ఇచ్చంపల్లి నుంచి చేపడతామని చెప్పిందని అన్నారు. కానీ, ఇప్పుడు పోలవరం నుంచి 200 టీఎంసీల గోదావరి నీళ్లను తరలించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. జూన్ 2 నాడు సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కనీసం జై తెలంగాణ అనకపోవడం మన ఖర్మ అని, తెలంగాణ గ్రహచారం బాగాలేక రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని కవిత వ్యాఖ్యానించారు. జై తెలంగాణ అనని వారికి, అమరవీరులకు నివాళులర్పించని వారికి సీఎం కుర్చీలో కూర్చొనే అర్హత లేదన్నారు. ఇప్పటికైనా రేవంత్ జై తెలంగాణ అనాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పిడికిలెత్తి బయటికి వస్తేనే తెలంగాణ వచ్చిందని, దానివల్లే ఇవాళ అధికారంలో ఉన్నామన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఆ విషయాన్ని మరిచిపోయి కేసీఆర్‌కు నోటీసులివ్వడం దారుణమన్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం ప్రారంభిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం పేరు మార్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు ఎటువంటి సంబంధంలేని రాజీవ్‌గాంధీ పేరు పెట్టడం సరికాదన్నారు. అమరులు శ్రీకాంతచారి, యాదిరెడ్డి, ప్రజాకవి కాళోజీ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టాలని సూచించారు. రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఆమోదించిన బీసీ బిల్లులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా తాత్సారం చేస్తోందని కవత మండిపడ్డారు. ఇటీవల ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి కలిసిన సమయంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడారు తప్ప.. బీసీ బిల్లు మీద మాట్లాడలేదని ఆరోపించారు. బీసీ బిల్లును డీప్ ఫ్రిడ్జ్‌లో పెట్టే ప్రయత్నం చేస్తే బీజేపీకి సెగ తాకేలా పోరాటం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి పోరాటం చేస్తుందని అన్నారు.



జాగృతి కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న కవిత

జాగృతి కమిటీల ఏర్పాటు..

మైనారిటీల హక్కుల కోసం కూడా జాగృతి పోరాటం చేస్తుందని కవిత ప్రకటించారు. జాగృతిలో మైనారిటీల హక్కుల కోసం ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ విభాగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాగృతి తరఫున ఎస్సీ, ఎస్టీ విభాగాన్ని ఏర్పాటు చేసి ఆ వర్గాల కోసం ఉద్యమిస్తామన్నారు. అయితే, తాము పోరాటాలు చేస్తుంటే కొంతమంది ఓర్వడం లేదన్నారు. తెలంగాణ కోసం బీజేపీ నాయకులు మాట్లాడకపోవడం దారుణమని, 8మంది ఎంపీలను గెలిపించినా కేంద్రం నుంచి రూపాయి తీసుకురాలేదని విమర్శించారు. గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను కాపాడకపోతే తెలంగాణ జాగృతి పవర్ చూపిస్తామన్నారు. కాగా, తెలంగాణ జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీరావును నియమిస్తున్నట్లు ఆ కార్యాలయం తెలిపింది.

బీజేపీతో పొత్తు ఉంటుందని ఏమార్చారు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లోకి.. వచ్చినప్పుడల్లా కేసీఆర్ ఇదే చెప్పారు: సంజయ్



కరీంనగర్, మే 31(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీలోని చాలా మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లోకి వచ్చారని.. అలా జరిగిన ప్రతిసారీ కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమై కమలంతో పొత్తు పెట్టుకుంటామని చెప్పి వారిని కాషాయ గూటికి రాకుండా చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ అంటేనే అవినీతి పార్టీ అని, కవితను అరెస్టు చేయకుండా ఉండటానికి బీజేపీతో కలవడానికి బీఆర్ఎస్ ప్రయత్నించిందని చెప్పారు. కుటుంబ పార్టీని తాము దగ్గరకు రానివ్వలేదని తెలిపారు. శనివారం కరీంనగర్‌లో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్, హరీశ్‌రావు భేటీ విషయం తెలియదని, ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అని తెలిపారు. కవిత విషయంలోనూ అదే డ్రామా నడుస్తోందని చెప్పారు కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నిర్మాణ దర్శకత్వంలో కవిత పాత్రధారిగా చార్‌పత్తా సినిమా నడుస్తోందన్నారు. కవిత ఎపిసోడ్‌తో ప్రజలకు మేలు జరుగుతుందా..? అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై చర్చ జరగకుండా చిట్‌చాట్‌ల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర జరుగుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ముమ్మాటికీ దేశద్రోహమే అని సంజయ్ అన్నారు. సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా, పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి, కాళేశ్వరం ప్రాజెక్టు, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫాంహౌస్, ఫార్ములా-ఈ రేసు కేసుల విషయంలో అరెస్టులు ఉంటాయని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నాయని, వాళ్లెన్ని కుట్రలు చేసినా అది జరగదని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయ పరిధిలో 18 గోవులు చనిపోవడంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని సంజయ్ అన్నారు.

'మల్లేశం' సినిమాకు గద్దర్ అవార్డు





చింతకింది మల్లేశం, అవార్డు పొందిన మల్లేశం సినిమా పోస్టర్‌లో హీరో ప్రియదర్శి

ఆలేరు, మే31(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డు అందుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన చేనేత కార్మికుడు చింతకింది మల్లేశం జీవిత చరిత్ర ఆధారంగా నిర్మించిన మల్లేశం సినిమాకు తెలంగాణ ప్రభుత్వం 2019 సంవత్సరానికి ప్రకటించిన గద్దర్ అవార్డుకు ఎంపికైంది. చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎంతో శ్రమించిన మల్లేశం జీవిత ఘట్టాలను ఆధారంగా చేసుకుని రూపొందించారు. మల్లేశం సినిమా ఘన విజయం సాధించి ప్రేక్షకుల ఆదరణ పొందింది. ఆ సినిమా ప్రతిష్ఠాత్మకమైన గద్దర్ అవార్డుకు ఎంపిక కావడంపై ఆసు యంత్రం సృష్టికర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం సంతోషం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాణ బాధ్యతలు నిర్వహించిన రాజు రాచకొండ, నటీనటులు ప్రియదర్శి, అనన్యలకు ఆ సినిమా నిర్మాణ సాంకేతిక నిపుణులకు మల్లేశం ధన్యవాదాలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆయుర్వేద దుకాణం దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సూర్యాపేటటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని పూలసెంటర్ సమీపంలో గల ఆయుర్వేద దుకాణం శనివారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని పూలసెంటర్‌లోగల తెడ్ల పాండు రంగయ్య సన్స్ ఆయుర్వేద దుకాణం శనివారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. చుట్టుపక్కలవారు, స్థానికులు గమనించి దుకాణ యజమానికి సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి వచ్చి అగ్నిమాపక అధికారులకు సమాచారమిచ్చాడు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.25లక్షల విలువైన ఆయుర్వేద మందులు దగ్ధమైనట్లు దుకాణ యజమాని తెడ్ల ప్రవీణ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం కోడూరు గ్రామానికి చెందిన తాడూరి లాలుకు చెందిన ఎద్దు మృతి చెందింది. వ్యవసాయ క్షేత్రం వద్ద మేతమేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో రూ.70వేల విలువైన ఎద్దు మృతిచెందింది. ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

అంగన్‌వాడీలకు డబుల్ ధమాకా

● రిటైర్‌మైంట్ వయో పరిమితి 65ఏళ్లకు పెంపు, బెనిఫిట్స్ రెట్టింపు ● ఉమ్మడి జిల్లాలో 8,412 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ప్రయోజనం

అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు రాష్ట్ర ప్రభుత్వం రెండు శుభవార్తలను చెప్పింది. ఒకే పర్యాయం డబుల్ ధమాకాను ప్రకటించింది. టీచర్ల, ఆయాల ఉద్యోగ విరమణ వయో పరిమితిని ఐదేళ్లు పొడిగింపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను రెట్టింపు చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో టీచర్ల, ఆయాల ఉద్యోగ విరమణ వయో పరిమితి 60 నుంచి 65 ఏళ్లకు పెరిగింది. టీచర్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను రూ.లక్ష నుంచి రూ.2లక్షలకు, ఆయాల బెనిఫిట్స్ రూ.50వేల నుంచి రూ.లక్షకు పెరిగింది.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్,)

ఉమ్మడి జిల్లాలోని 8412 మంది టీచర్లు ఆయాలకు ప్రయోజనం చేకూరనుంది. 60 ఏళ్లు నిండాక వీఆర్ఎస్ తీసుకునే వారికి కూడా పెంచిన బెనిఫిట్స్ వర్తిస్తాయి. కాగా మే మొదటి వారంలో మిని అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ మిని అంగన్‌వాడీ టీచర్ల వేతనాలను రూ.7,800 నుంచి రూ.13,650కి పెంచిన విషయం విధితమే. దీంతో సుమారు 25రోజుల వ్యవధిలోనే అంగన్‌వాడీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం మూడు శుభవార్తలను చెప్పినట్లైంది.

10 నెలలు గడిచినా అందని బెనిఫిట్స్

అంగన్‌వాడీ వ్యవస్థలో మొట్టమొదటి రిటైర్మెంట్స్ జూలై 2024లో జరిగినవి. దీంతో ఉమ్మడి జిల్లాలో ఒకేసారి సుమారు 800 మంది వరకు టీచర్లు ఆయాలు 60 ఏళ్ల వయో పరిమితి నిబంధనతో ఉద్యోగ విమరణ పొందారు. ఈ మేరకు నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన టీచర్లుకు రూ.లక్ష, ఆయాలకు రూ.50వేల చొప్పున రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందాయి. కానీ అదే సమయంలో ఉద్యోగ విరమణ పొందిన యాదాద్రి భువనగిరి జిల్లాలో 129మంది టీచర్లు, ఆయాలకు నేటికీ బెనిఫిట్స్ అందలేదు. దీంతో అప్పటినుంచి పోరాటాలు ఆందోళనలు చేస్తున్నప్పటికీ రిక్త హస్తమే మిగులుతున్నది. అయితే గతంలో ఇచ్చిన హామీ మేరకు వయోపరిమితి జూలై 2024లో ఉద్యోగ విరమణ పొందిన టీచర్లు, ఆయాలకు కూడా పెరిగిన బెనిఫిట్స్‌ను వర్తింపజేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే పెండింగ్‌లో ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లా విశ్రాంత టీచర్లు, ఆయాల బెనిఫిట్స్‌ను నూతన జీవోకు అనుగుణంగా ఇవ్వాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాకుమారి కోరారు.



అనాథ కాదు.. మా ఇంటి ఆడపడుచు

● బాల సదనంలో వస్త్రాలంకరణ వేడుకలు

భువనగిరి టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): పలు కారణాలతో కుటుంబానికి దూరమై బాల సదనంలో ఉంటూ చదువుకుంటున్న ఓ బాలిక ముచ్చటను స్త్రీశిశు సంక్షేమ శాఖ తీర్చింది. ప్రతీ అమ్మాయి వస్త్ర పుష్పాలంకరణ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని ఆశపడటం సహజం. కానీ, భువనగిరి బాలసదనంలో అనాథగా ఉన్న రేణుకకు యాదాద్రి భువనగిరి జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ అండగా నిలిచి శనివారం ఘనంగా నూతన వస్త్రాలంకరణ వేడుకలను నిర్వహించి ఆనందం నింపింది. రేణుక అనాథ కాదు.. మా ఆడపడుచు అంటూ అధికారులు ఆత్మీయతను పంచారు. జిల్లా సంక్షేమ అధికారి కే.నరసింహారావు, ఆర్డీవో కృష్ణారెడ్డి, సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, సభ్యులు మల్లేశం, శివరాజు, ఇస్తారి ఈ వేడుకలకు హాజరై ఆశీర్వదించి బహుమతులు అందజేశారు. బాలసదనం సూపరింటెండెంట్ సరిత, సీడీపీవోలు ఆర్.స్వరాజ్యం, శైలజ, వెంకటరమణ, ఆశ ప్రోగ్రాం అధికారి వీణ, కోఆర్డినేటర్ సత్యవతి, డీసీపీవో కవిత, బీఆర్‌టీ కోఆర్డినేటర్ అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



భువనగిరి పట్టణంలోని బాలసదనంలో రేణుకకు నూతన వస్త్రాలంకరణ చేస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు

కుమార్తె వివాహం.. మరుసటి రోజే తల్లి మృతి

● నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో ఘటన

మర్రిగూడ, మే 31 (ఆంధ్రజ్యోతి): కుమార్తె వివాహం మరుసటి రోజే తల్లి మృతి చెందడంతో ఆ ఇంట విషాదం నెలకొంది. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన గుండ్ల కృష్ణవేణి(45) కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. 10 సంవత్సరాల క్రితమే ఆమె భర్త అనారోగ్యానికి గురై మృతి చెందాడు. అప్పటికే కృష్ణవేణికి నలుగురు ఆడపిల్లలున్నారు. తండ్రి మృతి చెందడంతో పిల్లల పోషణ భారం ఈమెపై పడింది. అప్పటి నుంచి ఇప్పటివరకు కాయకష్టం చేస్తూ వీరిని పోషిస్తూ చదువులు చదివిస్తూ కుటుంబానికి అండగా ఉంది. భర్త చనిపోయి తన అనంతరం నలుగురి ఆడపిల్లలో ఇద్దరి ఆడపిల్లల వివాహం చేసింది. ఈ నెల 30న మూడో కుమార్తె అయిన ఝాన్సీ వివాహం శుక్రవారం జరిగింది. తల్లి తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. వివాహానికి రాలేకపోయింది. ఝాన్సీ వివాహం జరిగిన మరుసటి రోజే మే 31 (శనివారం) ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందింది. తల్లి మృతి చెందడంతో నలుగురు కుమార్తెలు కన్నీటి పర్యంతమయ్యారు. కృష్ణవేణికి మగ పిల్లలు లేనందున చిన్న కుమార్తె మనీషా తల్లికి తలకొరివి పెట్టింది. ప్రస్తుతం చిన్న కుమార్తె మనీషా మర్రిగూడ మండలంకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది.



కృష్ణవేణి(ఫైల్)

అనారోగ్యంతో ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, మే31(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం 14వ వార్డు గణేశ్‌నగర్‌లో ఓ వ్యక్తి అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గణేశ్‌నగర్‌కుచెందిన గురిజ మైసయ్య (60) కొంత కాలంగా అనారోగ్యంలో బాధపడుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

శనివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మైసయ్య కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు.

ఫాస్టాగ్‌లో సాంకేతిక సమస్య

● పంతంగి టోల్‌గేట్ వద్ద నిలిచిన సేవలు

● యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి వద్ద ట్రాఫిక్ జామ్

చౌటుప్పల్ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ గేటు వద్ద శనివారం ఫాస్టాగ్ సేవలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రయాణికుల వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 8.00 నుంచి 8.20 గంటల వరకు పంతంగి టోల్‌గేటు వద్ద సర్వర్ సమస్యతో ఫాస్టాగ్ పని చేయలేదు. దీంతో టోల్‌గేటుకు ఇరువైపులా హైదరాబాద్-విజయవాడ వైపున వాహనాలు నిలిచిపోయాయి. 20 నిమిషాల పాటు ఫాస్టాగ్ సాంకేతిక సమస్యలతో పని చేయకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌తో వాహనాదారులు ఇబ్బందులుపడ్డారు. పైఅధికారుల సూచన మేరకు వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లను కంప్యూటర్లలో నమోదు చేసుకుని వాహనాలను పంపించారు. వాహనాలు వెళ్లిపోయిన కొద్దిసేపటి తర్వాత రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా టోల్‌ఫీజులు ఫాస్టాగ్ బ్యాలెన్స్ నుంచి కట్ అయ్యాయి. టోల్‌గేటు సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. 30నిమిషాల తర్వాత ఫాస్టాగ్ సేవలు పునరుద్ధరించారు.



చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద నిలిచిన వాహనాలు

గుట్టలో భక్తుల సందడి



స్వామివారి వెండిజోడు సేవ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్య క్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహించారు. స్వయం భువులు, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారిని వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ప్రధానాలయం ముఖ మండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండీజోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు.

కిక్కిరిసిన ఉభయ క్యూలైన్లు

ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సుమారు 50వేల మంది భక్తులు తరలిరావడంతో ఉభయ క్యూలైన్లు కిక్కిరిశాయి. గర్భాలయంలో స్వయంభువులకు దర్శించుకున్న భక్తులు ఆలయ ముఖమండపంలో ఉత్సవమూర్తుల వద్ద ప్రత్యేకపూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వాహనాలపై రద్దీ పెరిగింది. ధర్మదర్శనం భక్తులకు మూడు గంటలు, ప్రత్యేక దర్శన భక్తులకు గంట సమయం పట్టినట్టు భక్తులు తెలిపారు. కొండకింద, పైన బస్టాండుల్లో వాహనాల రద్దీతో భక్తుల రాకపోకలకు ఆటంకం కలిగింది. రద్దీకి తగ్గట్టు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో బస్సుల కోసం భక్తులు పరుగులు పెట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.56,14,289 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. తిరుమల బృందంచే భక్తి సంగీతం, దుర్గ కూచిపూడి డాన్స్ అకాడమీ కూచిపూడి నృత్యం కార్యక్రమాలు నిర్వహించారు. రేపు రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా ఉదయం 8.30గంటలకు ఈవో క్యాంపు కార్యాల యం వద్ద జాతీయ పతాక ఆవిష్కరించనున్నట్లు డీఈవో దోర్బల భాస్కరశర్మ తెలిపారు.

మట్టపల్లిలో నృసింహుడి కల్యాణం



మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో రాజలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహుడి నిత్యకల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు నిర్వహించారు. తదుపరి కల్యాణ మూర్తులను పరిణయోత్సవ వేదికపైకి వేంచేయించి పుణ్యాహవాచనం గావించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

హుజూర్‌నగర్, మే 31(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో దీక్షిత్‌నగర్ కాలనీకి చెందిన ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌లోని పాత శ్రీలక్ష్మి థియేటర్ సమీపంలోని లింగగిరి మేజర్ కాల్వకట్ట పక్కన గుడిసెలు వేసుకొని జీవిస్తున్న చింతల రాము (25) శనివారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. రాము తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోగా నాయనమ్మ చింతల రాములమ్మ వద్ద పెరిగాడు. కాగా రాముకు ఒక అక్క ఉంది. రాము నాయనమ్మ రాములమ్మ, అతడి అక్క గోపమ్మ లింగగిరి కాల్వ పక్కన డేరా వేసుకొని కూలినాలి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా, రాము జులాయిగా తిరుగుతుండేవాడు. గోపమ్మకు వివాహం కాగా, వారు కాల్వకట్ట పక్కనే ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటుండగా, ఆ ఇంట్లో నిద్రించేందుకు రాము శుక్రవారం రాత్రి వెళ్లాడు. గోపమ్మ, అతడి బావ ఆళ్లగడ్డ పక్కన డేరాలు వేసుకున్న చోటికి వెళ్లి నిద్రించారు. కాగా, శనివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో రాము కుటుంబ సభ్యులు అద్దె ఇంటికి వెళ్లి చూడగా అనుమానాస్పద స్థితిలో అతడు మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి అతడి మృతదేహాన్ని తరలించారు. రాము మృతదేహంపై పలు గాయాలు ఉన్నట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని, ఈ విషయంపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూవివాదంలో దాడి: కేసు నమోదు

తుంగతుర్తి, మే 31, (ఆంధ్రజ్యోతి): భూ వివాదం విషయమై దాడి చేయడంతో కేసు పోలీసులు కేసు నమోదు చేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి సీఐ నరసింహారావు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గొట్టిపర్తి గ్రామంలో బానోతు బాలు, బానోతు వెంకట్రాం కుటుంబాల మధ్య ఒకటిన్నర ఎకరాల విషయమై వివాదం ఉంది. గత నెల 27వ తేదీన బానోతు బాలు, కుమారుడు ప్రతాప్ ఆ భూమిలో కడ్డీలను కూలీలతో పాతిస్తుండగా, బానోతు వెంకట్రాం, ఆయన సోదరుడు బానోతు శంకర్, భార్య శాంతమ్మ, కుమారుడు నరేష్ వెళ్లారు. ఈ నేపథ్యం పరస్పరం దాడి చేసుకున్నారు. బానోతు బాలు ఫిర్యాదు మేరకు వెంకట్రాం, శంకర్, శాంతమ్మ, నరేష్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

బోనమెత్తిన తేలకంటిగూడెం

కనగల్, మే 31 :(ఆంధ్రజ్యోతి) మండంలోని తేలకంటిగూడెం గ్రామంలో కంఠమహేశ్వరస్వామి సూరమాంబదేవిల నూతన ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు గ్రామ దేవగౌడ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం బోనంకుండలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పురుషులు బలిగంపలతో ఆలయానికి చేరుకుని నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం ఆలయంలోని విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ జరిపారు. రాత్రి స్వామిఅమ్మవారి కల్యాణాన్ని కళ్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గౌడ కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాలలకు వేళాయె



భువనగిరిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

- రేపటి నుంచి ఇంటర్ తరగతులు
- ఉమ్మడి జిల్లాలో సుమారు 400 కళాశాలలు
- ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం విద్యార్థుల 28,884 మంది విద్యార్థులు
- ప్రభుత్వ కళాశాలలకు చేరని పాఠ్యపుస్తకాలు
- రెండేళ్లుగా రాని ఉపకార వేతనాలు

ఇంటర్ కళాశాలలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 2025-26 ఇంటర్ విద్యా సంవత్సరం జూన్ 1న ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ తొలిరోజే ఆదివారం ఉండడంతో జూన్ 2న వేసవి సెలవుల అనంతరం ఇంటర్ కళాశాలలు తెరుచుకొనున్నాయి. అదే రోజు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కావడంతో మొదటి రోజే విద్యార్థులు, లెక్చరర్లు వేడుకల్లో పాల్గొననున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 400 ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య గురుకుల ఆశ్రమ ప్రైవేట్ కళాశాలల ఉండగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 28,884 మంది ఉన్నారు. ప్రథమ సంవత్సరం ప్రవేశాలు కొనసాగుతున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)

ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ కళాశాలలకు మాత్రమే ఇంటర్ బోర్డ్ లాగిన్ ఇవ్వడంతో ఆయా కళాశాలలో ప్రవేశాల ప్రక్రియ పూర్తవుతున్నది. గురుకుల కళాశాలలో కూడా గతానికి భిన్నంగా ఈ విద్యా సంవత్సరం నుంచి నేరుగా ఇంటర్ ప్రవేశాలను స్వీకరిస్తుండడంతో విద్యార్థుల చేరికలు పెరుగుతున్నాయి. తొలిరోజు నుంచే ప్రథమ, ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. కానీ ప్రైవేట్ కళాశాలల గుర్తింపు రెన్యువల్ ఇంకా పూర్తి కాకపోవడంతో లాగిన్ లభించలేదు. దీంతో ప్రైవేట్ కళాశాలలో అడ్మిషన్ల సందడి ఇంకా ప్రారంభం కాలేదు. కానీ యాజమాన్యాలు మాత్రం ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 39, 145 మంది విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణులయ్యారు. దీంతో ఇంటర్ ప్రవేశాలపై అధికారులు, ప్రైవేట్ యాజమాన్యాలు ఆశలు పెట్టుకున్నారు. కానీ ఇంటర్‌లో చేరేవారి సంఖ్య త్వరలో తేలనుంది.

నిరుత్సాహంగానే ఇంటర్ ఫలితాలు

పదవ తరగతి పరీక్ష ఫలితాలతో పోలిస్తే ఉమ్మడి జిల్లాలో ఇంటర్ ఫలితాలు కాస్త దిగదిడుపుగానే ఉంటున్నాయి. విద్యార్థుల భవిష్యత్తులను నిర్ణయించడంలో ఇంటర్ విద్య కీలకమైనది. ఇంటర్‌లో చేరే కోర్సుల ఆధారంగానే విద్యార్థులు స్థిరపడే రంగాన్ని నిర్దేశిస్తుంది. కానీ ఇంతటి కీలకమైన ఇంటర్ విద్యపై అధికారులు, యాజమాన్యాలు అవసరమైనంత శ్రద్ధ చూపడం లేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇందుకు పరీక్ష ఫలితాలే నిదర్శనమని అంటున్నారు. ఇటీవలే ఫలితాలలో ఉమ్మడి జిల్లాలో ఇంటర్ పరీక్షలకు 54,923 మంది హాజరు కాగా 33,684 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ప్రథమ సంవత్సరం 28,253 మందికి 15,985 మంది, ద్వితీయ సంవత్సరం 26,040 మందికి 17,699 మంది ఉత్తీర్ణులయ్యారు. మూడు సంవత్సరాలలో కూడా సుమారుగా ఇదే తీరులో ఫలితాలు ఉన్నాయి. దీంతో ఇప్పటికైనా ఇంటర్ విద్యపై అధికారులు శ్రద్ధ చూపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మెరుపులేవి..

ఉమ్మడి జిల్లాలో ఉన్న వందల సంఖ్యల ఇంటర్ కళాశాలలో వేలాదిమంది విద్యార్థులు చదువుతున్నారు. కానీ ఇంటర్మీడియట్ ఆధారిత వృత్తి విద్య కోర్సుల అర్హత పరీక్షలలో మాత్రం ఆశించిన స్థాయిలో మెరుపులు ఉండటం లేదని విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ కళాశాలలు మినహా మిగతా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు తరగతుల నిర్వహణకే పరిమితమవుతున్నాయని పలువురు అంటున్నారు. నీట్, ఎంసెట్, ఐఐటీ జేఈఈ, బిట్ సాట్, నాటా తదితర వృత్తి విద్య అర్హత పరీక్షలలో ఉమ్మడి జిలా నుంచి మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులు వేళ్లపైన లెక్కపెట్టే సంఖ్యలోనే ఉండడం ఉమ్మడి జిల్లా ఇంటర్ విద్యా వ్యవస్థను పలువురు తప్పు పడుతున్నారు. ప్రభుత్వ కళాశాలలు మొక్కుబడిగా, ప్రైవేట్ కళాశాలలు ఆర్భాటానికి పరిమితమవుతున్నాయని దీంతో విద్యార్థులు నష్టపోతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తు, శ్రేయస్సు కోసం యాజమాన్యాలు చిత్తశుద్ధి చూపాలని విద్యావేత్తలు అంటున్నారు.

ప్రభుత్వ కళాశాలలో తీరిన లెక్చరర్ల కొరత

ఇటీవలే ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయడంతో గత విద్యా సంవత్సరంలో పోలిస్తే ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్స్ కొరత తీరింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 150 వరకు ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య గురుకుల కళాశాలలు ఉన్నా యి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పోలిస్తే గురుకుల కళాశాలలోనే విద్యార్థుల ప్రవేశాలు అధికంగా ఉంటున్నాయి. పరీక్ష ఫలితాలలో కూడా ఇదే తీరు కొనసాగుతున్నది.

ఆనవాయితీ ప్రకారం మొదటి రోజే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను ఇవ్వాల్సి ఉన్నది. కానీ మరో వారం రోజుల అనంతరమే పాఠ్యపుస్తకాలు కళశాలలకు రానున్నట్టు తెలిసింది. ప్రభుత్వ కళాశాలలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రతి ఏటా లభించే రూ.5 వేలు, బీసీ విద్యార్థుల రూ. 4వేల ఉపకార వేతనాలు గత రెండు విద్యా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో కూడా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని నాటి, నేటి ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి.

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

ఆలేరు రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు గొంగిడి సునీత పార్టీ శ్రేణులకు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో శనివారం విలేకరులతో మాట్లాడారు. జూన్ 2వ తేదీన తెలంగాణ ప్రజలు సంబుర పడిన రోజు అని అన్నారు. ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు కలిగించిన విద్యార్థుల యువకుల బలిదానాల ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం సిద్ధంచిందన్నారు. సిద్ధించిందన్నారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గంగుల శ్రీనివాస్, కర్రె వెంకటయ్య, యాదయ్య, పుట్ట మల్లేశం, మునిసిపల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

చౌటుప్పల్ రూరల్, మే31(ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని దూషించినట్లు అసత్య కల్పిత వార్త ప్రచురించిన తెలంగాణ స్క్రైబ్ డిజిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం సీఐ మన్మథకుమార్‌కు ఫిర్యాదు చేశారు. తప్పుడు వార్తలు రాసి ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా ప్రయత్నం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, నాయకులు వెన్‌రెడ్డి రాజు, ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నర్సింహ, మురళి, జంగయ్యగౌడ్, పాల్గొన్నారు.

విద్యుత్ డిజిటల్ యంత్రాలపై అవగాహన

కొండమల్లేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) విద్యుత్ బిల్లులకు సంబంధించిన నూతన డిజిటల్ యంత్రాల వినియోగంపై ఉద్యోగులకు డివిజనల్ ఇంజనీర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో శనివారం అవగాహన కల్పించారు. విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని, పెండింగ్ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏడీఈలు సైదులు, సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివిజనల్ ఇంజనీర్ విద్యాసాగర్

అమ్మో... జూన్

(5వ పేజీ తరువాయి)

రూ.3లక్షల వరకు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. చదువుకునే పిల్లలు ఉన్న రైతులకైతే ఇటు పంటల సాగు పెట్టుబడితో పాటు అటు పిల్లల చదువులకు అయ్యే ఖర్చు ఆందోళన కలిగిస్తోంది.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ ఉచితంగా ఇచ్చినా

ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఉచితంగా ఇచ్చినా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చదివితే పిల్లల భవిష్యత్ బాగుపడుతుందన్న భావనతో అటుగానే మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారెందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన లభిస్తే అందులో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు వారి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు ఎందుకు పంపుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేస్తున్నా ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదంటున్నారు. తామే చదువుకోక చాకిరీ చేస్తున్నామని, కష్టమైనా, నిష్టూరమైనా పిల్లలను మంచిగా చదివించాలంటూ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల వైపు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల ఫీజులను, ఇతర ఖర్చులు నియంత్రిస్తే కొంతమేలు జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

ఘనంగా అహల్యబాయి హోల్కర్ జయంతి వేడుకలు



నల్లగొండ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రామగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): పుణ్యశ్లోక లోకమాత రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలను శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాణి అహల్యాబాయిన చేసిన సేవలు గుర్తించిన ప్రధాని మే 21వ తేదీ 31వ వరకు జయంతి ఉత్సవాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యకమంలో భాగంగా బీజేపి జిల్లా కార్యాలయంలో మహిళలతో వేడుకలను భారీగా నిర్వహించామ న్నారు. 300 సంవత్సరాల క్రితమే అహల్యాబాయిదేవి హిందూ ధర్మం గురించి, హిందూ దేవాలయాల గురించి, పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టి దేవాలయాల పునర్నిర్మాణానికి నడుం బిగించి హిందూ ధర్మ పరిరక్షణకై పోరాడిన వీర వనిత అని కొనియాడారు. బీజేపీ జిల్లా _ అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమల్లోకి తీసుకువచ్చిందని అన్నారు. . 300 ఏళ్ల క్రితం ఎన్నో పోరాటాలు చేసి ప్రతిష్ఠాత్మకమైన దేవాలయాల నిర్మాణానికి, దేవాలయాల్లో కొలనులను, వసతి గృహాలతో పాటు రవాణా మార్గాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా నాయకుడు గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్, పల్లెబోయిన శ్యాంసుందర్; జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న మౌని రాములు, జిల్లా కోశాధికారి మోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, గుండా నవీన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గడ్డం మహేష్, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండేటి సరిత, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు రావిళ్ల కాశమ్మ, మునగాల సుధారాణి, మన్ కీ బాత్ జిల్లా కన్వీనర్ నేవర్స్ నీరజ, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు తార, మునగాల సుధారాణి, దాసోజు అరుణ, కూతురు విజయ, కొప్పు జయశ్రీ పాల్గొన్నారు.

9న అరుణాచలంకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నల్లగొండ, మే 31 (ఆంధ్రజ్యోతి):పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదర్శన కోసం జూన్ 9న సాయంత్రం 5గంటలకు అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రద్దీని బట్టి ప్రత్యేక సర్వీసులు నడుపుతామని, అరుణాచలం వెళ్లే భక్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, తమిళనాడులోని గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుందన్నారు. వివరాలకు 9298008888లకు ఫోన్ చేసి అన్ని సమీప బస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న యల్లావుల రాములు

హుజూర్‌నగర్ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అమరవీరులు కుటుంబాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు కోరారు శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో 1200 మంది ప్రాణ త్యాగం చేయగా, వారి కుటుంబాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ పార్టీ కూడా అమరవీరుల కుటుంబాలను నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పోరాడిన అమరవీరుల కుటుంబాలను, ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ప్రతి నెలా రూ.10వేల పింఛన్ ఇవ్వాలన్నారు. లక్షలాది మంది సబ్బండ వర్గాలు రోడ్ల మీదకి వచ్చి ఉద్యమం చేసినందునే ప్రత్యేక రాష్ట్రం వచ్చిందన్నారు. ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. ఉద్యమకారుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువశక్తి సంక్షేమ పథకాల కేటాయింపులో ప్రాధాన్యం కల్పిం చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పోకల వెంకటేశ్వర్లు, యల్లావుల రమేష్, జడ శ్రీనివాస్‌యాదవ్, రమేష్, రమణ, వెంకన్న, స్వామి, వెంకటేశ్వర్లు, ధన్‌రాజు పాల్గొన్నారు.

పండిత, పామరుల కేంద్రంగా సోమేశ్వర శివజ్ఞాన పీఠం



చెర్వుగట్టు సోమేశ్వర శివజ్ఞాన పీఠంలో పూజలు చేస్తున్న స్వామి స్థితప్రజ్ఞానంద

నార్కట్‌పల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): సోమేశ్వర శివజ్ఞాన పీఠం భవిషత్‌లో పండిత పామరులకు నిలయంగా మారనుందని సనాతన సింధు సత్సంగ్ ట్రస్టు పీఠాధిపతి స్వామి స్థితప్రజ్ఞానంద స్వామి అన్నారు. సనాతన సింధు సత్సంగ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గీతా విజన్ సత్సంగముల కార్యక్రమాన్ని శనివారం నల్లగొండ జిల్లా చెర్వుగట్టు లోని సోమేశ్వర శివజ్ఞాన పీఠంలో ప్రారంభించారు. ఈ సంర్భంగా ఆయన భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి సన్నిధిలో సుమారు 60ఏళ్లకు పైగా పూజాధికాలతో స్వామిని సేవించిన సోమశర్మ ఆశయాలను పీఠం ఏర్పాటు ద్వారా ముందుకు తీసుకుపోతున్న రామలింగేశ్వరశర్మ కృషిని అభినందించారు. అంతకు ముందు చెర్వుగట్టు క్షేత్రాన్ని సందర్శించానని జడల రామలింగేశ్వరుడు విభూది ఎంతో మహిమాన్వితమైందన్నారు. చెర్వుగట్టు క్షేత్రం కూడా రాబోయే కాలంలో మరింత భక్తాదరణ పొందే క్షేత్రంగా పరిఢవిల్లుతుందని స్వామీజీ అభిలషించారు. ఈ సందర్భంగా భక్తులకు భగవద్గీత గ్రంథాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వర శివజ్ఞాన పీఠం అధ్యక్షురాలు పోతులపాటి అరుణారామలింగేశ్వర శర్మ, హరికిషన్, రాజేందర్ శర్మ, జయారపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో భళా..!

- ఎకరాకు115 బస్తాల ధాన్యం పండించిన రమాదేవి
- రమాదేవి కృషిని అభినందించిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): వరి సేద్యంలో పురుషులకు దీటుగా సాగుచేస్తూ భళా అనిపించుకుంటున్నారు మహిళా రైతు రమాదేవి. ఎకరానికి 115 బస్తాల ధాన్యం దిగుబడి సాధించిన ఆమె జిల్లాలోనే ఆదర్శ మహిళా రైతుగా నిలిచారు యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణ పరిధిలోని విలీన గ్రామం నారాయణగిరికి చెందిన మహిళా రైతు కుంట్ల రమాదేవి. వ్యవసాయం అంటే కేవలం పురుషులే చేస్తారనే భావన ఉంటుంది. కానీ పురుషులకు దీటుగా వరి సాగులో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు రమాదేవి. ఆమె చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లేది. వ్యవసాయ రంగంలో ప్రతి పనిపై ఆమె మంచి పట్టు సాధించింది. విత్తనాలు చల్లడం మొదలుకుని పంట కోసే వరకు అవగాహన ఉంది. ఆమె భర్త బాల్‌రెడ్డి లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. రమాదేవికి ఉన్న ఎకరన్నర పొలంతోపాటు మరో ఆరు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని స్వయంగా వరి సాగు చేస్తోంది. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఎకరాకు గరిష్ఠంగా 90 నుంచి 100 బస్తాల దిగుబడి వస్తుంది. కానీ రమాదేవి ఏకంగా ఎకరా పొలంలో 115 బస్తాలు (46 క్వింటాళ్లు) పండించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఎకరన్నర పొలంలో త్రిమూర్తి ప్లాంట్ సైన్సెస్ పీవీటీ లిమిటెడ్ కంపెనీకి చెందిన టీఎంఆర్‌హెచ్ 5786 అనే రకం సీడ్, మిగిలిన పొలంలో 202 రకం అనే హైబ్రీడ్ రకాలను సాగుచేసింది. అయితే త్రిమూర్తులు కంపెనీకి చెందిన టీఎంఆర్‌హెచ్ 5786 అనే రకానికి ఎకరాకు 115 వరి ధాన్యం బస్తాలు, 202 రకానికి ఎకరాకు 100 ధాన్యం బస్తాలు దిగుబడి వచ్చిందని ఆమె చెప్పారు. మళ్లీ ఈ సీజన్‌లో వరి సాగులో ఇదే రకం సీడ్ వాడుతున్నట్లు చెప్పారు. అయితే పరిసర ప్రాంతాల రైతులతో పోల్చుకుంటే అత్యధిక దిగుబడి సాధించడం ఆనందంగా ఉందని ఆమె అన్నారు. తనను గుర్తించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అభినందించి సన్మానించడంపై ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



వరి విత్తనాలు చల్లుతున్న మహిళా రైతు కుంట్ల రమాదేవి, విత్తన శుద్ధి చేస్తున్న రమాదేవి(ఇన్‌సెట్లో)

విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాలు ప్రారంభం

హుజూర్‌నగర్ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగగిరి గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో జూన్ 4వ తేదీన విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా పూజా కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు దామోదరాచార్యులు ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన మురళీ కృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తులు జైశ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

హుజూర్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక అన్నారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి కె.శ్రీధర్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మానసభలో ఆమె మాట్లాడారు. హుజూర్‌నగర్ డివిజన్‌లో రికార్డు స్థాయిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలుచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్‌చౌదరి, గజ్జి ప్రభాకర్, పొలిశెట్టి నర్సింహారావు, కోటేశ్వరరావు, వెంకటరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

3 నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు

మద్దిరాల, నాగారం మే 31(ఆంధ్రజ్యోతి): మద్దిరాల, నాగారం మండలాల్లో ఈ నెల మూడో తేదీ నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు కంట్లమయ్య, హరికిషోర్‌శర్మ తెలిపారు.

భవనాలు శిథిలం.. బతుకులు భయం.. భయం

(5వ పేజీ తరువాయి)

చాలామంది పురాతన భవనాల్లో నివసిస్తున్నారు. మరికొందరు ఆ భవనాలకు మరమ్మతులు చేయించుకుంటున్నారు. మునిసిపాలిటీల్లో గత సంవత్సరం క్రితం శిథిలావస్థకు చేరిన భవనాలకు మునిసిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు. వాటిని కూల్చివేయాలని ఆదేశించారు. అయితే అది ఎక్కడా పూర్తిస్థాయిలో ఆచరణ జరగలేదు. గతంలో వర్షకాలం ప్రారంభంలో సూర్యాపేట మునిసిపాలిటీలో 41 నోటీసులు ఇచ్చారు. ఇంకా సమగ్రంగా సర్వే చేస్తే పురాతన భవనాల సంఖ్య పెరిగే అవకాశముంది. వీటిల్లో కొన్నిటికి మరమ్మతులు చేశారు.

రానున్నది వర్షాకాలం

వర్షాలు వచ్చినప్పుడు పురాతన భవనాలు నానుతున్నాయి. ఎడతెరపి లేకుండా వర్షాలు కురిసినప్పుడు పురాతన భవనాలు ప్రమాదకరంగా ఉంటున్నాయి. ఆ భవనాలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా జిల్లాకేంద్రంలో సుమారు 50 ఏళ్లకు పైగా ఉన్న భవనాలు సైతం ఉన్నాయి. ఇవి వర్షానికి తడిస్తే కూలే ప్రమాదం ఉంది. ఏ చిన్న ప్రమాదం జరగకుండా ఉండాలంటే అధికారులు శిథిలావస్థకు చేరిన ఇళ్లను కూల్చివేయించాల్సి ఉంది. లేకపోతే మళ్లీ ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశాలు లేకపోలేదు.

పోటోరైటప్ 29టిగిరి3: తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో పై పెచ్చులూడిన ఓగది

ఏళ్ల క్రితం నాటి భవనాలు

తిరుమలగిరి: తిరుమలగిరి మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు చాలావరకు ఏళ్ల కిత్రం నిర్మించినవి. వీటిలో చాలా భవనాల పెచ్చులు ఊడిపోయాయి. వానాకాలంలో స్లాబుల మీద నీళ్లు నిలిచి భవనాలు తడిసి, పైకప్పుల నుంచి నీరు కారుతోంది. దీంతో కార్యాలయాల గదుల్లో ఫైళ్లు తడిసిపోతున్నాయి. తహసీల్దార్, గ్రంథాలయం, ఎంపీడీవో, ఏవో కార్యాలయాల్లో వానాకాలం వస్తే ఇబ్బంది పడాల్సిందేనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సూర్యాపేట శంకర్ విలాస్ సెంటర్‌లో శిథిలావస్థలో ఉన్న భవనాలు

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

కోదాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కోదాడ ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట వాహనాదారులకు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని అన్నారు. త్రిబుల్ రైడింగ్ చేస్తున్న వాహనాదారులకు నిబంధనలకు మేరకు జరిమానా విధిస్తామన్నారు. అదేవిధంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్ చేసేవారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని అన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు ఉండాలని, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ఆయన వెంట సిబ్బంది, ఉపేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పొగాకు రహిత సమాజం కోసం కృషి చేయాలి



సూర్యాపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వెన్నెల ఆసుపత్రి నిర్వాహకులు

సూర్యాపేట అర్బన్, నూతనకల్, గరిడేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ మామిడి నరేష్ అన్నారు. అంతర్జాతీయపొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం సూర్యాపేటలో వెన్నెల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. పొగాకు ఉత్పత్తుల వాడకంతో 60 రకాల క్యాన్సర్ల బారిన పడే అవకాశం ఉందన్నారు.. పొగ తాగడం ప్రారంభించిన ఆరు నుంచి 10సెకండ్లలో నికోటిన్ మెదడుకు చేరుతుందని, అనతికాలంలోనే గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశం ఉందన్నారు. ముందుగా పొగాకు తాగడం మానేస్తామని తోటి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వెన్నెల ఆసుపత్రి నిర్వాహకులు భయ్యు నారాయణ, భయ్యు దయాకర్, నవిలే నాగరాజు, రియాజ్, సందీప్, మానస, సాయి, యామిని, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తుంగతుర్తి సీఐ నరసింహారావు అన్నారు. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ శనివారం నూతనకల్ మండల కేంద్రంలో ప్రజలకు పొగాకు, జర్దా, పాన్‌పరాగ్‌తో పాటు మత్తు పదార్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్న వయస్సులోనే చాలా మంది మత్తుకు బానిసై జీవితాలు ఆగం చేసుకుంటున్నారని అన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్‌ను సీఐ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

● పొగాకు ఉత్పత్తులకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని గరిడేపల్లి ప్రథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వి.నరేష్ అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెండెం వీరయ్య, పీహెచ్ఎన్ శారద, ఆర్ఐ ప్రవీణ్, అంజయ్య, కృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, కవిత, అంజలి, బాలకృష్ణ, ఆశా కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పాలకవీడు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995-96బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీరభద్రశర్మ, రామారావు, సుధాకర్, జగన్నాథం, వెంకటయ్య, విజయలక్ష్మి, కమలాకర్, వీరభద్రం, వీరారెడ్డి, రజని, సత్యనారాయణ పాల్గొన్నారు.

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

హుజూర్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆర్డీవో శ్రీనివాసులు కోరారు. శనివారం పట్టణంలో ఓయూ జేఏసీ, ప్రజాకళాకారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రకృతిని కాపాడేందుకు మొక్కలను నాటాలని, కాలుష్యాన్ని నివారించాలని కోరారు. ప్రతిఒక్కరూ మొక్కలు పెంచి, వాటిని సంరక్షించాలన్నారు. జూన్ 5న పట్టణంలోని టౌన్‌హాల్‌లో పర్యావరణ పరిరక్షణపై పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బాదె నర్సయ్య, సోమగాని నరేందర్, పందిరి యల్లారెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలి

అనంతగిరి, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పంచాయతీలకు రావల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు కోరారు. ఈ మేరకు శనివారం అనంతగిరి మండల కేంద్రంలో ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, నెల్లూరు లీలావతి, వి.శేషమ్మ, ఎల్.జానమ్మ, రాయల లలిత, రజిత, అజ్మీర బుజ్జి, కొండపల్లి రాణి పాల్గొన్నారు.

పంచాయతీలకు బిల్లులు విడుదల చేయలేదు: సర్పంచ్

తిరుమలగిరి రూరల్: గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయలేదని, బిల్లులు విడుదల చేసినట్లు వారం రోజుల క్రితం ప్రభుత్వం చేసిన ప్రకటన సరికాదని మర్రికుంటతండ గ్రామ సర్పంచ్ దేవానాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

ఆదర్శంగా రిటైర్డు ఉద్యోగుల సేవా కార్యక్రమాలు

కోదాడ టౌన్, నేరేడుచర్ల, మే 31(ఆంధ్రజ్యోతి): కోదాడలో రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనేక సేవా కార్యక్రమాలు దేశంలోనే ఆదర్శంగా ఉన్నాయని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. మే నెలలలో జన్మించిన రిటైర్డు ఉద్యోగుల పుట్టినరోజు వేడుకలను శనివారం కోదాడలోని పెన్షనర్స్ భవన్‌లో ఆ సంఘం కోదాడ యూనిట్ అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేట్ కట్ చేసి సామూహిక పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారా మయ్య, వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆనందంగా, సంతోషంగా ఉంటేనే ఆరోగ్యానికి మంచిదని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. అనంతరం పుట్టినరోజు నిర్వహించుకుంటున్న రిటైర్డు ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రఘువరప్రసాద్, విద్యాసాగర్, పొట్ట జగన్మోహన్‌రావు, అమృతరెడ్డి, వరప్రసాద్, భిక్షం పాల్గొన్నారు.

పెన్షనర్ల రాయితీలను వెంటనే చెల్లించాలి: సుదర్శన్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన రాయితీలను వెంటనే విడుదల చెల్లించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నేరేడుచర్లలోని పెన్షనర్ల భవనంలో నిర్వహించిన సామూహిక పుట్టినరోజు వేడుకలు, కోదాడలో ఇటీవల నిర్వహించిన పెన్షనర్ల రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన జిల్లా క్రీడాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు డీఏలు చెల్లించాలని, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజైనా కనీసం రెండు డీఏలు చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకటో తేదీన వేతనాలు అందజేయడం మినహా, ఎలాంటి రాయితీలు చెల్లించడం లేదన్నారు. ఈహెచ్ఎస్ కార్డుల బిల్లులను ప్రభుత్వం చెల్లించనందున వైద్య సేవలు అందించడం లేదన్నారు. రిటైర్డు ఉద్యోగులకు రావాల్సిన రాయితీలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర్‌రావు, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, పోతుగంటి సత్యనారాయణ, బండి బుద్ధారెడ్డి, చావా వీరభద్రరావు, రాజు, లక్ష్మారెడ్డి, వీరారెడ్డి, శ్రీరాంరెడ్డి, సుందరయ్య, సుభాష్‌చంద్రబోసుపాల్గొన్నారు.



సామూహిక పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న రిటైర్డు ఉద్యోగులు

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

సూర్యాపేటఅర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హూస్సేన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని విక్రమ్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో నాయకులు గోగుల వీరబాబు, ఎస్‌కే వాజిద్, ఎస్‌కే సయ్యద్, గులాం హూస్సేన్, రజాక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోదాడ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): నల్లబండగూడెం సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు చేస్తున్నందున మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 11గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని నల్లబండగూడెం, చిమిర్యాల, రెడ్లకుంట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మందుల సామేలుకు మంత్రి పదవి ఇవ్వాలి

నూతనకల్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి వర్గంలో ఎమ్మెల్యే మందుల సామేలుకు స్థానం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి బంటు బద్రి కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ సామాజిక వర్గానికి ఇప్పటివరకు మంత్రి పదవి లేనందున సీనియర్ అయిన సామేలుకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో డి.సాయి, రమేష్, గంగాధర్, విజేందర్, పవన్ పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగారం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో కృష్ణకాంత్ అన్నారు. శనివారం మండలంలోని నాగారం గ్రామీణ్ ఆగ్రో ఎఫ్‌పీలో ప్రభుత్వం అందజేసిన 18 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేసి మాట్లాడారు ఈ కార్యక్రమంలో ఏఈవోలు సాయిరాజ్, శ్రీనివాస్, సంధ్య, ఎఫ్‌పీవో ఎండీ కె. వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

సూర్యాపేట అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఈ నెల 2వ తేదీన(సోమవారం) వరంగల్‌కు చెందిన శరత్‌మాక్స్ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దండ శ్యాంసుందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు: సీపీఎం

మఠంపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్ అన్నారు. శనివారం మఠంపల్లిలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం సంపన్నలకు రూ.లక్షల కోట్ల రాయితీలు ప్రకటించి పేదలపై ధరల భారం మోపిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బాలునాయక్, జగన్మోహన్‌రెడ్డి, రన్‌మియా, కోటయ్య, శంభయ్య పాల్గొన్నారు.

వరంగల్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడ, మే 31 (ఆంధజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు అందుకుని ఢిల్లీ నుంచి స్వగ్రామం వరంగల్‌కు వస్తున్న నేపథ్యంలో స్వాగతం పలికేందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం కోదాడ నుంచి వరంగల్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కోదాడలో ఆ సంఘ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు మంద కృష్ణమాదిగ 30 సంవత్సరాలు పోరాటం చేశారన్నారు. భారత ప్రభుత్వం కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు ఇవ్వటం అభినందనీయమని అన్నారు. వరంగల్‌కు తరలి వెళ్లిన వారిలో కత్తి వెంకటేశ్వర్లు, యలమర్తి రాము, కర్ల కాంతారావు, సత్యరాజు, కృష్ణ, సోమయ్య, సుధీర్, లక్ష్మీకాంత్ ఉన్నారు

స్థాయిని మించిన విమర్శలను జగదీష్‌రెడ్డి మానుకోవాలి

నూతనకల్, మే 31 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అనుభవం కలిగిన నాయకులలో ఒకరైన ఏపీ సీఎం చంద్రబాబును విమర్శించే స్థాయి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డికి లేదని టీడీపీ మండల నాయకుడు వేల్పుల చంద్రయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థాయికి మించి విమర్శలను జగదీష్‌రెడ్డి మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అశోక్, వెంకన్న, భిక్షం, మల్లయ్య, రమేష్, విజయ్ తదితరులు ఉన్నారు

వైభవంగా గుండాలమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం

గరిడేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): గరిడేపల్లిలోని గుండాలమ్మ మిట్టలో గుండాలమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు త్రిపురం అంజన్‌రెడ్డి, పెండెం సుజాత శ్రీనివాస్‌గౌడ్, పయిడిమర్రి రంగనాథ్ దేవాలయ కమిటీ సభ్యులు కడియం సైదిరెడ్డి, ముచ్చపోతుల కృష్ణ, కొలిపాక నారాయణ, కొలిపాక వీరయ్య, శివ, నారాయణ, సైదులు, గౌతమ్, అనిల్, సతీ పాల్గొన్నారు.

జూన్ 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి

సూర్యాపేట టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి జూన్ 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కే.జగదీశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అల్ప సంఖ్యాల వర్గాల(ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, సిక్కులు) విద్యార్థులు విదేశాల్లో చదవడానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్ కింద రూ.20లక్షలు ఆర్థికసాయాన్ని రెండు విడతల్లో చెల్లిస్తారని తెలిపారు.వివరాలకు సెల్ నెం.9492611057ను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నూతనకల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల నోడల్ అధికారి డి.శివయ్య అన్నారు. శనివారం మండలంలోని పెదనెమిల గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో సీఆర్పీ రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామాలయ కమిటీ ఎన్నిక

మఠంపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత దొనబండతండాలో రామాలయం ఆలయ కమిటీని శనివారం గ్రామ పెద్దలు, నాయకులు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయ కమిటీ చైర్మన్‌గా బానోతు చిన్ననాయక్, వైస్ చైర్మన్‌గా భూక్య గోదావరి, కార్యదర్శిగా మాలోతు రమేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్య నరేష్‌నాయక్, కోశాధికారిగా భూక్య గోవిందును ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను నాయకులు, గ్రామ పెద్దలు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వెంకన్న మృతి సీపీఐకి తీరని లోటు

గరిడేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు నాయకుడు కోట వెంకన్న మృతి సీపీఐకి తీరని లోటు అని, ఆ పార్టీ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య అన్నారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన కోట వెంకన్న మృతదేహంపై శనివారం మండలంలోని గానుగుబండ గ్రామంలో పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమలో పోకల వెంకటేశ్వర్లు కుందురు వెంకటరెడ్డి, పంగాగోవింద్, ఆంజనేయులు, పీర్‌సాహెబ్, నరసింహారావు, పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి: సీపీఎం

హుజూర్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలను ప్రభుత్వం అరికట్టి రైతులను ఆదుకోవాలని సీపీఎం రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని ఏవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందేలా ప్రభుత్వం పర్యవేక్షణ చేయాలని, రైతులు పండించి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొంతిరెడ్డి శంభిరెడ్డి, వెంకన్న, నాగేశ్వరరావు, వెంకటయ్య, దుగ్గి బ్రహ్మం, మల్లీశ్వరి, కిరణ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగంలోని హక్కులను కాపాడుకోవాలి

హుజూర్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంలోని హక్కులను ప్రతి పౌరుడూ కాపాడుకోవాలని శాంతి సంఘం ఉపాధ్యక్షుడు కోడి ఉపేందర్, కాంగ్రెస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ జక్కుల శంభయ్య కోరారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని మల్లన్ననగర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ షరీఫ్, ఏఎస్ఐ బలరామిరెడ్డి, అశోక్, శ్రీను, రాము, శ్రీనివాస్‌యాదవ్, జగన్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి

హుజూర్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): 'ఉపాధి' కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోసనబోయిన హుస్సేన్ కోరారు. శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. 'ఉపాధి' కూలీలకు వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. మోదీ ప్రభుత్వం 'ఉపాధి' పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర చేస్తోందని అన్నారు. సంవత్సరంలో 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.600ల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాధవరావు, భద్రమ్మ, అరుణ, ఉపేంద్ర, వెంకటమ్మ, రాజ్యం, నర్సమ్మ, రామనర్సమ్మ, జానకమ్మ పాల్గొన్నారు.